## భద్రంగానే బడే చొక్కారావు!

**ఎన్‌కౌంటర్‌పై వీడిన ఉత్కంఠ**

ములుగు, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ శివారులో ఈ నెల 16న జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ (దాదా) అలియాస్ బడే చొక్కారావు మృతి విషయంపై ఉత్కంఠకు తెర పడింది. దామోదర్ ఎన్‌కౌంటర్ విషయం రోజుకో మలుపు తిరగుతూ వస్తున్నది. కాగా, ఆయన భద్రంగానే ఉన్నట్టు సోమవారం విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మొదటి నుంచి ఆయన మృతిని తల్లి, కుటుంబ సభ్యులు, బంధువులు, కాల్వపల్లి గ్రామస్థులు నమ్మలేదు. వారి నమ్మకమే నిజమైంది. కాగా ఆయన కాంకేర్ శివారు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాయపడినట్టు తెలిసింది. నాలుగు అంచెల భద్రత కలిగిన దామోదర్ ప్రాణాలతో బయటపడి ప్రస్తుతం సురక్షితంగా ఉన్నట్టు తెలుస్తున్నది. దీంతో మూడు రోజులుగా ములుగు జిల్లాతోపాటు తెలుగు రాష్ట్రాల్లో దామోదర్ మృతిపై వచ్చిన వదంతులు అవాస్తవమని తేలాయి. తాను సురక్షితంగానే ఉన్నట్టు దామోదర్ తన అనుచరుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసినట్టు తెలిసింది.

## 25 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ ): సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలు 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగనున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. మహాసభల్లో తొలిరోజు పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ హాజరుకానున్నారు. జాతీయ కార్యదర్శి బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొంటారు. మహాసభల్లో రాష్ట్ర కొత్త కార్యదర్శిని ఎన్నుకునే అవకాశముంది. రాష్ట్ర విభజన తర్వాత తమ్మినేని వీరభద్రం రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. పార్టీ నిబంధనల ప్రకారం ఓ నాయకుడు మూడుసార్లకు మించి రాష్ట్ర కార్యదర్శిగా పని చేయకూడదు. ఇప్పటికే తమ్మినేని మూడుసార్లు బాధ్యతలు నిర్వహించారు. కొత్త నాయకత్వ రేసులో పార్టీ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీనియర్‌నేత ఎస్ వీరయ్య పేర్లు వినిపిస్తున్నాయి.

# నల్లమలలో మైనింగ్ తవ్వకాలపై కన్నెర్ర

మొదటిపేజీ తరువాయి...

గ్రామంలోకి వచ్చి భయపెడుతున్నారని మహిళలు మండిపడ్డారు. 'మా పొలాల వద్దకు వచ్చి మా పిల్లలు, పెద్దలను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్తున్నారు' అంటూ దుమ్మెత్తిపోశారు. వారందరినీ వెంటనే వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు పోయినా మైనింగ్‌కు అంగీకరించేది లేదంటూ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు శాపనార్థాలు పెట్టారు. పనులు నిలిపివేయాలని, అరెస్టు చేసిన వారిని విడిచిపెట్టాలంటూ ఓ మహిళ పురుగుల మందు తాగేందుకు యత్నించగా.. పక్కన ఉన్నవారు అడ్డుకున్నారు. కాగా నిరసన తెలుపుతున్న ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. ఈ క్రమంలో అక్కడి పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు వెంటనే గ్రామాన్ని విడిచి వెళ్లాలని పెద్ద పెట్టున నినదించారు. గ్రామ సభ అనుమతి లేకుండా మైనింగ్ ఎలా జరుపుతారని నిలదీశారు.



నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామంలోకి పోలీసులు ప్రవేశించకుండా రోడ్డుకు అడ్డంగా స్థానికులు వేసిన ముళ్లకంపలు, కట్టెలు

చేసేది లేక పోలీసులు అరెస్టు చేసిన వారిని వదిలిపెట్టడంతో మైలారం వాసులు శాంతించారు. మైనింగ్ తవ్వకాలకు సంబంధించి కవరేజీ కోసం వెళ్లిన మీడియాను అక్కడున్న మైనింగ్ మాఫియా అడ్డుకున్నది. ఫొటోలు తీయడానికి ప్రెస్‌కు అనుమతులు లేవని దురుసుగా ప్రవర్తించారు. దారికి అడ్డంగా టిప్పర్ ఉంచి చాలా సేపు అడ్డుకొన్నారు.

### ప్రొఫెసర్ హరగోపాల్‌ను అడ్డుకున్న పోలీసులు

మైలారంలో స్థానికులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న మానవ హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్‌ను వెల్దండ పోలీసులు అరెస్ట్ చేసి గంట తరువాత విడిచిపెట్టారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం బలప్రయోగం చేయడం సరికాదని అన్నారు. ప్రజలతో చర్చించిన తర్వాతే మైనింగ్ పనులపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. లేకుంటే పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన

- ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్టును ఖండిస్తున్నాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ఆంక్షలు, కంచెలు, అరెస్టులు, నిర్బంధాలు రేవంత్ పాలనలో నిత్యకృత్యమయ్యాయని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా మైలారంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ హరగోపాల్‌ను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ప్రజాపాలన, ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటూ గప్పాలు కొట్టి, ఇప్పుడు ప్రజల తరుపున పోరాటం చేస్తున్న ప్రజా సంఘాల నేతల గొంతునొక్కడం అమానుషమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్‌తోసహా అరెస్టయిన ప్రజాసంఘాల నేతలను తక్షణమే విడుదలచేయాలని డిమాండ్ చేశారు.

**రేవంత్‌రెడ్డీ.. ఇదేనా ప్రజాపాలన?**

'సీఎం రేవంత్‌రెడ్డి గారూ.. ఇదేనా మీరు చెప్పిన సోకాల్డ్ ప్రజాపాలన? ఇందిరమ్మ రాజ్యమని చెప్పిన మీరు కంచెలు, ఆంక్షలు, అరెస్టులతో నాటి ఎమర్జెన్సీ పాలనను గుర్తుచేస్తున్నారు. మీ సొంత జిల్లాలోనే ఇంతటి దారుణ పరిస్థితులు ఉంటే, రాష్ట్రవ్యాప్తంగా ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. మైలారంలో అక్రమ మైనింగ్ జరుగుతున్నదని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని నిలదీశారు.

**ప్రజలను పీడించే పాలన: నిరంజన్‌రెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ప్రజాపాలన కాదు.. ప్రజలను పీడించే పాలన అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. గ్రామస్తుల నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన ప్రొఫెసర్ హరగోపాల్, ఇతర ప్రజాసంఘాల నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ సర్కారు నియంతృత్వ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

# ఫోర్త్‌సిటీ రోడ్డుకు భూములియ్యం

- ప్రాణాత్యాగాలకైనా మేము సిద్ధం
- మార్కెట్ ధరకు తక్కువ ఇస్తే ఎలా?
- భూమికి భూమి అయినా ఇవ్వండి
- జిల్లా కలెక్టర్ వచ్చి మాగోడు వినాలె
- రాచులూరు గ్రామసభలో రైతుల స్పష్టీకరణ



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రాజు

కందుకూరు, జనవరి 20: 'ఫోర్త్‌సిటీ రోడ్డుకు ఎట్టి పరిస్థితుల్లో మా భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేము. ఒకవేళ బలవంతంగా లాక్కోవాలని చూస్తే ప్రాణాత్యాగాలకైనా సిద్ధమే' అని బాధిత రైతులు తెగేసి చెప్పారు. ఫోర్త్‌సిటీ రోడ్డు భూసేకరణ కోసం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం రాచులూరు గ్రామ పరిధిలోని యాదవరెడ్డి ఫంక్షన్‌హాలులో గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ రాజు, తహసీల్దారు గోపాల్ మాట్లాడారు. ఫోర్త్‌సిటీ రోడ్డు నిర్మాణానికి రైతులు భూములను ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని తెలిపారు. దీంతో రైతు ఒక్కసారిగా భగ్గుమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో తమ భూములను ఇవ్వబోమని స్పష్టంచేశారు. సమాచారం, నోటీసులు ఇవ్వకుండా బలవంతంగా తమ భూముల్లో సర్వే ఎందుకు నిర్వహించారని రైతులు నిలదీశారు. మార్కెట్‌లో తమ భూములు ఎకరాకు రూ.3 కోట్లకు పైగా ధర పలుకుతుందని, ఆ భూములనే నమ్ముకొని తామంతా జీవనం సాగిస్తున్నానమి, ఈ దశలో తమ భూములను లాక్కొంటే ఎలా జీవిస్తామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ.90 లక్షలు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 330 అడుగుల రోడ్డుకు అంతా వ్యతిరేకమేనని తేల్చిచెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీశైలం, హైదరాబాదు కొత్తూరు జంక్షన్ నుంచి ఫోర్త్‌సిటీ వరకు రోడ్డు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ రోడ్డు వెంట వెళ్లడానికి ఏర్పాట్లుచేస్తే ప్రభుత్వానికి రూ.500 కోట్లు మిగులుతాయని, బలవంతంగా తమ భూములను లాక్కోవద్దని హితవు పలికారు. స్వయంగా కలెక్టర్ సమావేశానికి వస్తే రైతుల గోడు విన్నవిస్తామని, ఆయననే రప్పించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. లేదంటే తమకు భూమికి భూమి ఇవ్వాలని పట్టుబట్టారు. రైతుల వాదనలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో ఆర్‌ఐ యాదగిరి, సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్, రైతులు ఢిలీ గణేశ్ ముదిరాజ్, గుయ్యని సామయ్య, వెదిరె హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పరిశ్రమలో పేలిన రియాక్టర్

- ఆరుగురికి తీవ్రగాయాలు, మరొకరి పరిస్థితి విషమం
- ఐడీఏ బొల్లారంలోని శ్రీకర ఆర్గానిక్స్‌లో ఘటన

జిన్నారం (బొల్లారం) జనవరి 20: సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో రియాక్టర్ పేలింది. ఈ ఘటనలో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో శ్రీకర ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో అక్కడ పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఈశ్వర్ చంద్ర అగరియా పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. సీఐ రవీందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మియాపూర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# తెలంగాణ సంస్కృతి కట్టిపడేసింది

**వీడ్కోలు సభలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరాధే**

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు తనను కట్టిపడేశాయని, సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించడంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉన్నదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. ముంబై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయిన ఆయనకు సోమవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులంతా వీడ్కోలు పలికారు. మొదటి కోర్టు హాలులో జరిగిన జస్టిస్ అరాధే ప్రసంగిస్తూ.. అత్యున్నతమైన తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు. హైకోర్టులో మహిళా న్యాయమూర్తులు అధిక సంఖ్యలో ఉండటం మంచి పరిణామమని చెప్పారు. హైకోర్టు కార్యకలాపాల నిర్వహణ, కేసుల విచారణలో తనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కాబోయే యాక్టింగ్ చీఫ్ జస్టిస్, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ మాట్లాడుతూ.. జస్టిస్ అరాధే సేవలు ఎనలేనివని కొనియాడారు. కొవిడ్ సంక్షోభ సమయంలో కేసుల విచారణ కోసం మొదలు పెట్టిన ఆన్‌లైన్ విధానాన్ని తర్వాత కూడా కొనసాగించారని, రాష్ట్రంలోని కోర్టులను డిజిటలైజ్ చేయడంలో కీలక పాత్ర పోషించారని, లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపారని శ్లాఘించారు. కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్ బీ నరసింహశర్మ, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నర్సింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ జీ ప్రవీణ్ కుమార్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ అలోక్ అరాధేని ఘనంగా సత్కరించారు.

## అమెరికాలో హైదరాబాద్ యువకుడు మృతి

- దుండగుడి కాల్పుల్లో దుర్మరణం
- బాధిత కుటుంబానికి సబితాఇంద్రారెడ్డి పరామర్శ

ఆర్కేపురం, జనవరి 20: అమెరికాలోని వాషింగ్టన్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో హైదరాబాద్ ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన యువకుడు రవితేజ మృతి చెందాడు. 2022 మార్చి లో అమెరికా వెళ్లిన రవితేజ ఇటీవలే ఎంఎస్ మాస్టర్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఇంతలోనే 19న వాషింగ్టన్‌లో గుర్తుతెలియని వ్యక్తి జరిపిన కాల్పుల్లో రవితేజ మరణించాడు. స్నేహితులు హైదరాబాద్‌లోని రవితేజ తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కుమారుడి మరణవార్త తెలియగానే వారు శోకసంద్రంలో మునిగిపోయారు. పదిహేను రోజుల క్రితం రవితేజ పుట్టినరోజని, తాను త్వరలోనే ఇంటికి వస్తానని చెప్పాడని తండ్రి బోరున విలపించడం అందరినీ కలచివేసింది. రవితేజ మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రవితేజ కుటుంబ సభ్యులను మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పరామర్శించారు. ఉన్నత చదువుల కోసం వెళ్లిన కుమారుడు మృతి చెందడం ఆ కుటుంబానికి చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. రవితేజ మృతదేహాన్ని హైదరాబాద్ తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

### సాగునీటికోసం రోడ్డెక్కిన రైతన్న



సాగునీటి ఇక్కట్లపై పదిహేను రోజులుగా సూర్యాపేట జిల్లాలో పలుచోట్ల రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. తాజాగా ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని రామోజీతండా పరిసర ప్రాంతాల్లో ఎస్సారెస్పీ 71 డీబీఎం 22ఎల్ కెనాల్ కింద సాగు చేసే రైతులు 300 మంది సోమవారం చివ్వెంల – ముకుందాపురం ప్రధాన రహదారిపై పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో కాళేశ్వరం 15 ప్యాకేజ్ ద్వారా గొలుసు కట్టు చెరువులు నింపి సాగు జలాలు అందించాలని కోరుతూ రైతులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని చెరువులన్నీ వట్టిపోయి భూగర్భ జలాలు అడుగంటాయని, నాట్ల దశలోనే పంటలు ఎండిపోతున్నాయని జల సాధన సమితి మండల అధ్యక్షుడు జశ్వంత్ ఆవేదన వ్యక్తం చేశారు. తలాపునే పారుతున్న కాళేశ్వరం నీళ్లను చెరువులోకి మళ్లించి ఆదుకోవాలని కోరారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

### రుణమాఫీ కాలేదని బ్యాంకు ఎదుట నిరసన



రుణమాఫీ కాలేదంటూ పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ పంచాయతీ పరిధిలోని సెంటినరికాలనీ కేడీసీసీ బ్యాంకు ఎదుట సోమవారం పలువురు రైతులు బైఠాయించారు. రుణమాఫీ అయిందని పేర్లు ప్రకటించినా తమ ఖాతాలో జమ కాలేదని వాపోయారు. రెండు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు తమను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జాబితాలో పేర్లు ఉన్నా రుణమాఫీ విషయంలో అయోమయానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 మందికిపైగా రైతులకు రుణమాఫీ కాలేదని, ఇప్పటికైనా అధికారులు రుణమాఫీ డబ్బులు జమ చేయాలని కోరారు. – రామగిరి

### రెగ్యులరైజ్ చేయాలని..




విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్లకు కన్వర్షన్ ఇచ్చి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఈగలపెంట, తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రం సర్కిల్ కార్యాలయం ఎదుట దీక్షలు ప్రారంభించారు. 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు ఐదు నెలలుగా ఆందోళనలు చేపట్టినా నేటికీ స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. –దోమలపెంట

# యూరియా కోసం బారులు

- మళ్లీ మొదలైన రైతుల కష్టాలు
- సొసైటీల వద్ద అన్నదాతల నిరీక్షణ

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 20: కాంగ్రెస్ సర్కార్ పాలనలో యూరియా కోసం రైతులకు తిప్పలు మళ్లీ మొదలయ్యాయి. ఎరువుల కోసం పీఏసీఎస్ గోదాం వద్ద ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్‌లతో రైతన్నలు బారులు దీరాల్సి వస్తున్నది. మళ్లీ పాతకాలం వలే ఎరువుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. యాసంగిలో సాగు చేసిన వరిపంటకు యూరియా అవసరముండగా, తగినంత సరఫరా లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో యూరియా కోసం సొసైటీల వద్ద బారులు తీరుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో సోమవారం గోదాము వద్దకు యూరియా లారీ వచ్చిందన్న సమాచారంతో మండలంలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాజాపేట మండల వ్యాప్తంగా గత యాసంగిలో 20వేల ఎకరాలు సాగు చేస్తే యూరియా కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సరఫరా చేసిందని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. ఈ సారి చెరువుల్లో నీళ్లు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరుబావులు ఎండిపోయి 10వేల ఎకరాలే సాగు చేసినప్పటికీ రైతులకు సరిపడా యూరియా అందించలేకపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఇచ్చే రెండు బస్తాల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నదని మండిపడుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్, మన్నెగూడెం సొసైటీలకు యూరియా లోడ్ రావడంతో రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలో ఉండి అవస్థలు పడ్డారు. ఎకరానికి మూడు బస్తాలు మాత్రమే ఇస్తున్నట్టు రైతులు తెలిపారు.



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సొసైటీ వద్ద యూరియా కోసం లైన్‌లో నిలబడిన రైతులు

### బస్తా యూరియా కోసం పడిగాపులు



పదేండ్లుగా యూరియా కోసం ఎప్పుడూ ఇలా పడిగాపులు కాయలేదు. కేసీఆర్ సర్కార్ రైతులకు అందుబాటులో సరిపడా యూరియా నిల్వలు ఉంచింది. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి రాలే. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తున్నది. పొద్దున్నే పనులు మానుకొని వస్తే ఇచ్చే రెండు బస్తాలకు అనేక కొర్రీలు పెడుతున్నారు. ఆధార్, పాసు పుస్తకాలు జిరాక్స్ ఉంటేనే ఇస్తామంటున్నారు. రైతులను కాంగ్రెస్ సర్కార్ నానా ఇబ్బందులు పెడుతున్నది.

– ఎస్‌కే కరీం, రైతు కాశెగూడెం, రాజాపేట మండలం

## రైతులను నట్టేట ముంచిన సర్కార్

- హామీల అమలులో విఫలం
- మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య ఫైర్

వేలేరు, జనవరి 20: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, వారికిచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసి వారి ఆత్మహత్యలకు కారణమవుతున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ఈ నిరసనలో మాజీ జడ్పీటీసీ చాడ సరితారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.



చిల్కోడులోని కృష్ణా ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాపు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

## ఫర్టిలైజర్ షాపులో నకిలీ పురుగుమందులు

- పిచికారీ చేయడంతో దెబ్బతిన్న మిర్చి పంట
- డోర్నకల్‌లో రైతుల ఆందోళన

డోర్నకల్, జనవరి 20 : మహబూబాబాద్ జిల్లా చిల్కోడులోని కృష్ణా ట్రేడర్స్ (ఫర్టిలైజర్)షాపులో చిల్కోడుకు చెందిన పది మంది రైతులు మిర్చిపంట కోసం ఇండోఫిల్ కంపెనీకి చెందిన ఎలెక్టో మందును కొనుగోలు చేశారు. మందు పిచికారీ చేయగా.. మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు సోమవారం నకిలీ మందు విక్రయించడంతోనే మిర్చి పంట దెబ్బతిన్నదని ఆరోపిస్తూ షాపు ఎదుట ధర్నాచేశారు. డోర్నకల్ సీఐ రాజేశ్, గార్ల బయ్యారం సీఐ రవికుమార్, ఏవో మురళీమోహన్ చేరుకొని కంపెనీ డీలర్ తిరుపతిని పిలిపించి రైతుల సమక్షంలో మాట్లాడారు. మందును ల్యాబ్ పంపించి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పురుగు మందులు విక్రయిస్తున్నా పట్టించుకోని ఏవో మురళీమోహన్‌ను సస్పెండ్ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



రోడ్డు పై ధర్నా చేస్తున్న మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నర్సింగాపూర్ ప్రజలు

## మున్సిపల్ కార్పొరేషన్‌లో కలుపొద్దు

- చిట్టి రామవరం, సుజాతనగర్ మండలవాసుల డిమాండ్
- మంచిర్యాల జిల్లా నర్సింగాపూర్ గ్రామస్తులు ఆందోళన

హాజీపూర్/ కొత్తగూడెం గణేశ్ టెంపుల్/ కొత్తగూడెం టౌన్, జనవరి 20: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామాలను కలపొద్దంటూ చిట్టి రామవరం, సుజాతనగర్ మండల ప్రజలు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన రామవరం ఏజెన్సీ ప్రాంతాన్ని తొలగించాలని గిరిజన జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో కలుపొద్దని సీపీఎం అనుబంధ రైతు సంఘం నేతలు పేర్కొన్నా రు. కార్పొరేషన్ వద్దు.. గ్రామ పంచాయతే ముద్దు' అంటూ మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామస్తులు ఆందోళన బాటపట్టారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్ చేస్తూ నర్సింగాపూర్‌ను విలీనం చేయడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు రహదారి–63పై రాస్తారోకో చేసేందుకు రాగా మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో రోడ్డు పక్కన టెంట్, వంట సామగ్రిని తెప్పించుకొని ధర్నా చేపట్టారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్, ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### 'డబుల్' ఇండ్ల కోసం ఆందోళన




డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పేదలు ఆందోళనకు దిగారు. సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ నెల 26వ తేదీ తర్వాత అర్హులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. – మహబూబ్‌నగర్

### పవర్‌లూం కార్మికుల ధర్నా



తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు చేనేత కార్మికులతో కలిసి సోమవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ చీరల 10 శాతం యారన్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని, కార్మికులకు రోజుకు రూ.వెయ్యి వేతనం వచ్చేలా కూలీ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. – సిరిసిల్ల కలెక్టరేట్